# జైలు కథలు 19

## "ఛీటర్"

అప్పటివరకూ డిస్పాచ్ చేయవలసిన ఆఫీస్ మరియు ఖైదీల లెటర్స్‌కు నంబర్స్ వేసి, రిజిష్టర్‌లో నోట్ చేసి, సంతకం కొరకు జైలరుగారి వద్దకు వెళ్ళాను. నేను వెళ్ళేసరికి ఎవరో యువకుడు ఆయన అడిగే వాటికి చక్కని యింగ్లీషులో సమాధానాలు చెప్తున్నాడు.

జైలరుగార్ని విష్ చేశాను. సమాధానంగా చిరునవ్వు నవ్వారాయన.

"ప్రసాద్ పోలీస్టేషన్‌కు క్రిమినల్స్ రిపోర్ట్సు పంపారా ?" అన్నారు.

"నిన్ననే పంపించారు సార్ !"అన్నాను

"వెరీగుడ్....బై దిబై దిసీజ్ మిష్టర్ విద్యాసాగర్ ఆఫ్ విజయవాడ. టేక్‌హిమ్ టు యువర్ బ్లాక్"అని అతన్ని పరిచయం చేసి, అతనివేపు తిరిగి "మిస్టర్ విద్యాసాగర్, ఫాలోహిమ్" అన్నారు. అతను మౌనంగా నన్ననుసరించాడు. రాత్రి బ్లాక్స్ క్లోజ్‌చేసిన తరువాత అతన్నిగూర్చి అడిగాను.

* * *

కృష్ణవేణి పవిత్ర జలంతో పునీతమై, కొండపై వెలసిన కనకదుర్గ చల్లని చూపులతో, ఎల్లప్పుడూ శోభాయమానంగా విరాజిల్లుతున్న పట్టణం విజయవాడ. అదే పట్టణంలో కాస్త స్థితికలిగిన కుటుంబంలో జన్మించాడు విద్యాసాగర్. తండ్రి మంచి హోదాకలిగిన వుద్యోగి. కాని నిరాడంబర జీవి. ఖచ్చితమైన మనిషి. ఆడంబరంగా జీవించాలనే తత్వంగలవాడు విద్యాసాగర్. లయోలా కాలేజీలో బి. యస్సీ. పూర్తి చేశాడు. డబ్బు చేతినిండుగా వుండటంతో స్త్రీ వ్యామోహానికి లోనయాడు. విజయవాడ చాలదన్నట్లు మదరాసు ప్రయాణాలు మొదలుపెట్టి, ఎక్స్‌ట్రాలతో ఎంగేజిమెంట్లు చేస్తున్నాడు. ఇంట్లో డబ్బు పెద్ద మొత్తాలలోనూ, కొన్ని ఖరీదైన వస్తువులు కూడా మాయం కావడం ప్రారంభించాయి. కన్నతల్లి మమకారంతో కప్పిపుచ్చేది.

ఒకనాడు ఆఫీసకి వెళ్ళిన తండ్రికి బాంక్ మేనేజరు ఫోన్‌చేసి, సుపుత్రుడు వచ్చి చెక్కు మార్చి ఐదువేలు పట్టుకు పోయినట్లుగ చెప్పాడు. డ్రాయరు సొరుగులోని చెక్‌బుక్ చూశారు ఆయన. ఒక చెక్ లేదు. నిన్ననే ఒక పార్టీకి యివ్వవలసిన ఐదు వేలకు చెక్ వ్రాసి సంతకం చేశారు. జరిగినది అర్థం చేసుకొని క్రోధంతో కంపించిపోయా రాయన. మదరాసు మహానగరంలో ఐదు వేలు పెద్దలెఖ్ఖలోవి కావు. అయిపోయిన తరువాత స్నేహితుల ఆశా జ్యోతుల్లా వెలిగారు. సాగర్ కలవారి బిడ్డగానే తెలుసుగాని, ఈ విధంగా తయారయినట్లు తెలియదు. మొదటి ప్రయత్నం మదురైలో మొదలెట్టాడు. స్నేహితుడు చక్కగా ఆదరించాడు. బిజినెస్ మీద వచ్చినట్లుగా చెప్పుకున్నాడు సాగర్. ఆ రోజు శనివారం. తన ప్రయత్నానికి అదే అవకాశంగా ఎంచుకున్నాడు. హడావిడిగా స్నేహి



తుణ్ణి సమీపించాడు. తన వద్దనున్న ఏభై వేల చెక్కు చూపించాడు. శనివారం బాంక్ టైం అయిపోవటం వల్ల చెక్ మారలేదని. యిదే రోజు పార్టీకి పదివేలు కట్టకపోతే సరుకు రిలీజ్ కాదనీ, తాను సోమవారం చెక్‌మార్చి డబ్బు యిచ్చేస్తానని స్నేహితుణ్ణి నమ్మించాడు. పాపమా స్నేహితుడు అతనివద్ద డబ్బు లేక, టు యిన్ వన్, ఏషి కాకియేరా కుదువపెట్టి పదివేలు యిచ్చాడు. అంతే.... తరువాత మరలా సాగర్‌ను చూడలేదా స్నేహితుడు.

తరువాత ప్రయత్నం డెహ్రాడూన్. అక్కడా అదే చెక్కుపై, ఎవారమే, పదివేలు సంపాయించాడు. సమయాన్ని, స్నేహితుల్ని ఎన్నుకోవడంలోనూ, వారితో మాట్లాడే విషయాల్లోనూ చాల ఛాకచక్యం ప్రదర్శించేవాడు. ఖరీదైన మనిషిగా కనుపించేవాడు. ఇలా తక్కువ మొత్తం బ్యాంకిలో డిపాజిట్ చేసి, కొంత తగ్గించి డిమాండ్ డ్రాఫ్ట్ తీసికొని, దాని అంకె వేలల్లోకి మార్చి, దూరప్రదేశం వెళ్ళి, అక్కడ కాష్ చేసిన సంఘటనలు కూడా వున్నాయి. ఏమైనా తెలివితేటలు, గుండె ధైర్యం మెండుగా వున్నాయి సాగర్‌లో.

సాగర్ దూరపు బంధువు భర్త మహబూబ్‌నగర్ బాంక్‌లో పనిచేస్తున్నాడు. అక్కడకు వెళ్ళాడు. రెండురోజులున్నాడు. ఈ రెండు రోజులలోనూ వారికోసం, సినిమాలకని, డిన్నర్లకని, షికార్లకనీ డబ్బు బాగా ఖర్చుచేశాడు సాగర్. మూడవరోజు అతనివెంట బాంక్‌కి వెళ్ళాడు. కాసేపున్న తరువాత ఏదో పనివున్నట్లు స్కూటర్ (బాంక్ వుద్యోగిది) తీసికొని బయలుదేరాడు. సాగర్ వెళ్ళిపోయిన అరగంటకు మామవద్దనుంచి బాంక్ వుద్యోగికి జాబు వచ్చింది. అందులో సాగర్ మంచివాడు కాదని, మోసగాడని, వాకవేళ అతనువస్తే యింట్లోవుండనివ్వద్దని వుంది. వెంటనే రిక్షాపై యిల్లు చేరాడు. "మీ స్నేహితుని భార్యకు నా రాళ్ళ నెక్లెస్ లాటిదే చేయించటానికి, మీ స్నేహితుడు నమూనాకొరకు అడిగితే, మీరు స్కూటర్ యిచ్చి పంపినట్లుగా చెప్పి, నెక్లెస్ తీసుకొచ్చాడండీ సాగర్". భార్యమాటలు విని జరిగిన మోసాన్ని గ్రహించి వెంటనే టాక్సీస్టాండుకు వెళ్ళి, టాక్సీలో హైదరాబాదు వేపు బయలుదేరాడు. జడ్చర్ల చౌరస్తాలోస్కూటర్ వుంది. అనుమానంతో రైల్వేస్టేషన్‌వేపు వెళ్ళాడు. వాకప్రక్కగా బెంచీపై కూర్చున్న సాగర్‌ను గుర్తించి, బయటకువచ్చి పోలీసుల సహకారంకోరాడు కేసు నమోదైంది. రిమాండుకు పంపారు కోర్టువారు. అంతా విన్న నేను "ఈ కేసు ఎలా తేలుతుంది" అన్నాను. "చాల తేలిక ప్రసాద్. నాకు, ఆమెకు పెండ్లికి ముందు అక్రమ సంబంధం వున్నదని, నాకు కొద్దిగా డబ్బు అవసరం కలిగి యిక్కడకు వచ్చి ఆమెను డబ్బు అడుగగా డబ్బులేక, ఆమే స్వయంగా ఆ నగ నాకు ఇచ్చినట్లు నేను కోర్టులో వాదిస్తాను" అని నిర్లక్ష్యంగా నవ్వాడు.

"ఛీ దుర్మార్గుడా!" అని అనుకోకుండా వుండలేకపోయాను మనసులో.

—ప్రసాద్